క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశం రేపు

ఐరాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుసుమకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల పనితీరు జగరుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందని, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తమ శాఖల అభివృద్ధికి సంబంధించిన నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు. వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యురాలు, కో–ఆప్షన్ మెంబర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సంబంధిత ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

నేడు ఆస్పత్రికి కేంద్ర బృందం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి మంగళవారం కేంద్ర బృందం రానున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు బృంద అధికారులు ఆస్పత్రికి చేరుకుంటారన్నారు. పరిశుభ్రత, నిర్వహణ తదితర అంశాలపై తనిఖీ చేయనున్నారని ఆయన పేర్కొన్నారు.

స్పందనకు 19 అర్జీలు

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి అర్జీలను స్వీకరించగా, మొత్తం 19 అర్జీలు వచ్చాయి. ఇందులో దారి సమస్యలు, ఇంటి స్థలం, సర్వే తగదాలు, మ్యుటేషన్ తదితర సమస్యలున్నాయి. వీటిని పరిశీలించి సకాలంలో పరిష్కరించేలా చూడాలని ఆయన వీఆర్‌ఓలకు ఆదేశించారు.


8న మణికంఠేశ్వర స్వామికి పూజలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధంగా ఉన్న శ్రీ మణికంఠేశ్వర స్వామి ఆలయంలో మార్చి 8న శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. మార్చి 8న మహాశివరాత్రి సందర్భంగా మణికంఠేశ్వర స్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లింగోద్భవ కాలభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

గృహాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

తవణంపల్లె: మండలంలోని సచివాలయాల్లో హౌసింగ్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ నరేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో జగనన్న లే ఔట్లలో 746 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో ఇప్పటి వరకు 454 మందికి రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు వివరించారు. మండలంలోని అరగొండ, పట్నం, పుణ్యసముద్రం, మత్యంతో పాటు పలు సచివాలయాల్లో 262 ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉందన్నారు. సచివాలయాల్లోని వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు స్పందించి ఇంటి పట్టాదారులను పిలిపించి వెంటనే రిజిస్ట్రేషన్ చేయించి నివేదిక పంపాలని తెలిపారు.

కనుల పండువగా వసంతోత్సవం



ఊరేగుతున్న వేణుగోపాలుడు

వి.కోట: స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో పది రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం వసంతోత్సవం కనుల పండువగా నిర్వహించారు. రాజస్థాన్ సమాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి చిత్రగోపురం, శయనోత్సవం నిర్వహించారు. మొదట స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, రకరకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కాల్పించారు. అనంతరం స్వామివారిని ఉత్సవ మూర్తులుగా కొలువుదీర్చి పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఉభయదారులు, ఆలయ కమిటీ సభ్యులు శరవణ, ధర్మకర్త సీతారామయ్య, భక్తులు పాల్గొన్నారు.

తమిళనాడు సరిహద్దుల్లో నిఘా ముమ్మరం

పలమనేరు: రానున్న సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే తమ లక్ష్యమని ఇందుకోసం కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిఘా ముమ్మరం చేశామని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఏపీ సుబ్బరాజు తెలిపారు. సోమవారం రాత్రి ఆయన పలమనేరు సెబ్ స్టేషన్ పరిధిలోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దు గంఢ్రాజుపల్లె చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఎన్నికల సంఘం స్వతంత్ర వ్యవస్థ కాబట్టి ఎలాంటి మొహమాటం లేకుండా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. తాము ఎన్నికల సంఘానికి కట్టుబడి పని చేస్తామన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బు, లిక్కర్ ఇక్కడికి అక్రమ రవాణా చేయకుండా ఇప్పటికే సరిహద్దులో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే తమ లక్ష్యమన్నారు. ఆయన వెంట స్థానిక సెబ్ అధికారులు పాల్గొన్నారు.



కుండల బొమ్మలు తయారు చేస్తున్న సంధ్య

రుణంతో కుండల తయారీ

ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సంధ్య. గుడిపాల మండలం వసంతాపురం గ్రామానికి చెందిన ఈమె స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు. ఈమెకు రూ.లక్ష రుణం మంజూరైంది. ఆ రుణంతో కుండల తయారీ, బొమ్మలు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటోంది. ప్రభుత్వం రూ.35 వేలు సబ్సిడీ అందించింది.



ఇటుకల తయారీ

ఈ ఫొటోలోని మహిళ పేరు నళిని. గుడిపాల మండలం సంగమంగళంకు చెందిన ఈమె ఇటుక బట్టీల ఏర్పాటుకు వైకేపీ ద్వారా రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రూ.లక్ష రుణం మంజూరైంది. ఆ మొత్తంలో ఇటుక బట్టీల తయారీ యూనిట్ ప్రారంభించారు. ప్రతి నెలా కొంత ఆదాయం పొందుతున్నారు. బ్యాంకు మంజూరు చేసిన రుణంలో ప్రభుత్వం రూ.35వేలు సబ్సిడీగా అందజేసింది.

మహిళలకు సువర్ణావకాశం

- ఆర్థిక అభ్యున్నతికి తోడ్పాటు
- డీఐసీ, కేవీఐబీ ఆధ్వర్యంలో సబ్సిడీ రుణాల మంజూరు
- కుటీర పరిశ్రమల ఏర్పాటే ధ్యేయం

గుడిపాల: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ప్రభుత్వం సువర్ణావకాశం అందిస్తోంది. డీఐసీ(డిస్ట్రిక్ ఇండస్ట్రీస్ సెంటర్), కేవీఐబీ(ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డ్) ఆధ్వర్యంలో విరివిగా సబ్సిడీ రుణాలను అందజేస్తోంది. మహిళలు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని, ఆర్థిక స్వావలంబన సాధించడమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులేస్తోంది. డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ఇప్పటికే జిల్లాలోని మహిళలకు విరివిగా సబ్సిడీ రుణాలు మంజూరయ్యాయి. వందల సంఖ్యలో యూనిట్లు కూడా ప్రారంభమయ్యాయి. ఆసక్తి కలిగిన మహిళలు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు.

ఎవరు అర్హులు

జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘంలోని సభ్యులైన మహిళలు ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రామ్(పీఎంఈజీపీ) రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుల వయసు 18 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి. కనీస విద్యార్హత 8వ తరగతి. దరఖాస్తు దారు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉండకూడదు. ఇంటి పన్ను, కరెంట్ బిల్లు, పాన్‌కార్డ్ కలిగి ఉండాలి. గ్రామైక్య సంఘాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారులు తప్పనిసరిగా మంచి సిబిల్ స్కోర్ కలిగి ఉండాలి.

రుణాలు మంజూరు చేసే యూనిట్లు ఇవే

వైఎస్సార్ కాంత్రి పథం ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరుచేసే యూనిట్లు 238 వరకు అందుబాటులో ఉన్నాయి. పేపర్ ప్లేట్ల తయారీ, టెంట్ హౌస్, మినీ రైస్ మిల్లు, పిండిమిల్లు, ఫొటో స్టుడియో, వత్తుల తయారీ, కుండల తయారీ, ఇటుక బట్టీల ఏర్పాటు, చెప్పులు, బూట్ల తయారీ, కెమికల్ ఇండస్ట్రీ తదితర యూనిట్‌ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేస్తారు. రుణాలు మంజూరయ్యే లబ్ధిదారులు తప్పనిసరిగా యూనిట్లు ప్రారంభించాలి.

35 శాతం సబ్సిడీ

జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ), ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డ్(కేవీఐబీ) ఆధ్వర్యంలో అర్హులైన మహిళలకు కనీసం రూ.50వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తారు. బ్యాంకు వడ్డీకే రుణాలు మంజూరు చేస్తారు. మంజూరు చేసే రుణాల్లో 35 శాతం వరకు సబ్సిడీగా ప్రభుత్వం అందిస్తోంది. లబ్ధిదారులు తాము తీసుకున్న రుణాలకు సంబంధించిన వాయిదాలను మూడేళ్ల పాటు సక్రమంగా చెల్లించినట్లయితే సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేస్తారు.

దరఖాస్తు చేసుకోవాలి



డీఐసీ, కేవీఐడీ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాల కోసం స్వయం సహాయక సంఘ మహిళలు డీఆర్‌డీఏ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న తరువాత కుటీర పరిశ్రమల ఏర్పాటు ద్వారా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే మహిళలకు సబ్సిడీ రుణాల ద్వారా లోన్లు అందజేశాం. మిగతా సభ్యులకు కూడా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం.

–సుధారాణి, ఏపీయం, గుడిపాల

సీఎం వైఎస్ జగన్‌తో విజయానందరెడ్డి



చిత్తూరు కార్పొరేషన్: కుప్పానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి



కార్వేటినగరం: విద్యార్థులు జీవిత లక్ష్యాన్ని ఎంచుకుని మంచి క్రమశిక్షణతో ముందుకెళ్లాలని ఈటూ ఓపెన్ సాఫ్ట్‌వేర్ సీనియర్ డైరెక్టర్ శంకర్ అన్నారు. సోమవారం ప్రైవేటు విద్యాసంస్థల జూనియర్ కళాశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసంలో క్రమశిక్షణతో పాటు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకెళ్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని తెలిపారు. అనంతరం కళాశాలలో ఉప్పురాళ్లతో పవిత్రమైన ఓంను ఏర్పాటు చేసి కొవ్వొత్తులు వెలిగించి సరస్వతీ దేవికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో అందరికీ వైద్య సేవలు







గుడిపాల: వైద్యసేవలందిస్తున్న డాక్టర్ అనూష, ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్, తవణంపల్లె: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్సలు చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంటివద్దే మెరుగైన వైద్యం

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని కొత్తకోట గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది హైమావతి, సుమతి, గీత, తమరైలు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యసేవలు

తవణంపల్లె: పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని మాధవరం, స్వస్తిక్ నగర్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ మోహన్‌వేలు 83 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు అందజేశారు. గర్భవతులకు, బాలింతలకు, బీపీ, సుగర్‌వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భవతులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రక్తహీనత రాకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న స్టేట్ బ్యాంకు అధికారులు

గుడిపాల: నాబార్డ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నంగమంగళం భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజర్ తులసీరామ్ అన్నారు. బొమ్మసముద్రం, గట్రాళ్లమిట్ట గ్రామాల్లో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన బ్యాంకులో ఉండేటువంటి రుణాలు, ప్రధానమంత్రి సురక్షబీమా, జీవన జ్యోతి బీమా, అటల్ పింఛన్ యోజన, సామాజిక భద్రత పథకాలు, బీమా, పొదుపు సంఘాలు, సైబర్‌నేరాల గురించి గ్రామస్తులకు అర్థమయ్యే రీతిలో వారికి వివరించారు. రూరల్ పోర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం ఆధ్వర్యంలో మ్యాజిక్ షో, పాటల ద్వారా ప్రజలకు తెలియజేశారు.

పోలియో రహిత సమాజ స్థాపనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు

యాదమరి: గ్రామాల్లో పోలియో రహిత సమాజ స్థాపనకు నడుం బిగిద్దాం అని మండల వైద్యాధికారులను, ఏఎన్‌ఎంలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు కోరారు. మండలంలోని సంతగేటు ప్రభుత్వాసుపత్రిలో సోమవారం వైద్యులకు, ఏఎన్‌ఎంలకు, ఆశ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. మార్చి 3న జాతీయ స్థాయిలో పల్స్ పోలియో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న చంటి పిల్లలు అందరికీ పోలియో చుక్కలు వేసి విజయవంతం చేయాలన్నారు. 2014లోనే భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందన్నారు. అయితే పక్క దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతుండడంతో ముందు జాగ్రత్తగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సర్వేలెన్స్ అధికారి అనిల్‌కుమార్ నాయక్, యాదమరి వైద్యాధికారి సురేఖ, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆర్‌కే విద్యాలయ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ బద్రీనారాయణ అన్నారు. నగరంలోని మిట్టూరులో ఉన్న ఆ కళాశాలలో సోమవారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సేవాదృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం చిత్తూరు పరిసర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ



కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌లోని ఇంటర్ విద్యార్థులతో అధ్యాపకులు

యాదమరి: మండలంలోని కె.గొల్లపల్లె హైస్కూల్‌లో ప్లస్ ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులకు హాల్ టికెట్లు బాలికల కళాశాల ప్రిన్సిపల్ లలిత అందించారు. ఈ నెల 1వ తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు సోమవారం ఉదయం కళాశాలలో హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయ బృందం వారికి ఆశీర్వాదం అందించింది. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలని పిలుపునిచ్చారు. కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కనకాచ్చారి కళాశాల విద్యార్థులకు ఉచితంగా రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల నాటి కల సాకారం చేసిన జగన్

కుప్పం: కుప్పం ప్రజల నాలుగు దశాబ్దాల కల సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణాజలాలను పారించి కుప్పం చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. సోమవారం రాజుపేట వద్ద హంద్రీ–నీవా నుంచి కృష్ణా జలాలను కుప్పం నియోజకవర్గానికి తరలింపును సీఎం ప్రారంభించారు. బహిరంగ సభలో ఎమ్మెల్సీ మాట్లాడారు. ఆనాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హంద్రీ–నీవా కాలువ పనులకు పునాదులు వేస్తే..ఇప్పుడు ఆయన తనయుడు జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో కాలువ పనులు పూర్తి చేసి కుప్పం ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలను తీర్చారన్నారు. 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గేయంలో శంకరంబాడి సుందరాచార్యులు 'బిరా బిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటే..' అన్న మాటలు ఇక్కడ దృశ్యపరంగా కుప్పం ప్రజానీకానికి ఆవిష్కృతమైందన్నారు. దాదాపు 750 కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణా జలాలను కుప్పం తీసుకువచ్చేందుకు జగన్ మోహన్ రెడ్డి భగీరథ ప్రయత్నం చేశారన్నారు. ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అంటూ సొంతడబ్బా కొట్టుకునే చంద్రబాబు ఇన్నేళ్లలో ఏం చేశారనేది ప్రజలు ఇకనైనా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షనేత ఎమ్మెల్యే నియోజకవర్గం అయినప్పటికీ వివక్ష చూపకుండా, రాజకీయాలకు అతీతంగా, కేవలం నాలుగున్నరేళ్లలో జగనన్న కుప్పం అభివృద్ధిని పరుగులు తీయించారని స్పష్టం చేశారు. పులివెందుల, కుప్పంను రెండు కళ్లలా భావిస్తూ సమ ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష్టం చేశారు. నాలుగు మండలాలకు ప్రత్యేకంగా రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్‌డివిజన్, కుప్పం మున్సిపాలిటీని ఏర్పాటు చేశారని చెప్పారు.

కార్మికులను వేధించొద్దు


చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికులను వేధించడం మానుకోవాలని యూనియన్ నాయకులు నాగరాజన్ అధికారులను హెచ్చరించారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సోమవారం పారిశుధ్య కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీధుల్లో ఉన్న చెత్తను రోడ్లపై కుమ్మరించి, అందులోంచి తడి-పొడి చెత్తను వేరు చేయాలని కార్మికులపై ఒత్తిడి చేయడం సమంజసం కాదన్నారు. నాయకులు వినాయక, సుగుణ, దొరస్వామి, జయశంకర్, పరదేశి, వరలక్ష్మి, సురేష్, రమాదేవి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహానంది విగ్రహ ప్రతిష్ట



వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయంలో గల రాజగోపురం ఎదుట స్థానిక విశ్రాంత బ్యాంక్ మేనేజర్ బొప్పన మోహనమురళితో నిర్మించిన మహానంది విగ్రహాన్ని సోమవారం ఆలయ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. ముందుగా వినాయక పూజతో ప్రారంభించి, ప్రత్యేక హోమపూజలు చేపట్టి విగ్రహ ప్రతిష్ట జరిగింది. అనంతరం నందీశ్వరునికి ప్రత్యేక పుష్పాలంకరణ నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు మహానందిని దర్శించుకుని ధూపదీప నైవేద్యాలను సమర్పించారు.







కాణిపాకంలో చలువ పందిళ్లు

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసరాల్లో తగిన ఏర్పాట్లు చేశారు. వేసవిలో వేడి తీవ్రత నుంచి ఉపశమానికి చలువ పందిళ్లను ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ఏర్పాటు చేశారు. ఆలయ మాడ వీధుల్లో భక్తులు తిరగడానికి గ్రీన్ మ్యాట్, కూల్ పెయింట్‌ను వేశారు. ఆలయం లోపల తాగునీరు మరిన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

–కాణిపాకం(యాదమరి)